

# ప్రేమ పుష్పం!

— శారదా అశోకవర్ధన్

"వెన్నెల్లో తాజ్‌మహల్‌ని చూడాలి అంటారుగానీ మురారీ అలా అన్న వాళ్లు, ఇంతవరకూ వెన్నెల్లో సముద్రాన్ని చూసి ఉండరని నా ఉద్దేశం. చూస్తే, ఆ నిండు చంద్రుడు, ఈ పండు వెన్నెలా, పాల పొంగులా నురుగలు కక్కుతూ ఉరుకులు పరుగులతో ఉక్కిరయిపోతూ, ఉవ్వెత్తున ఎగిరిపడుతూ ఇసుకతిన్నెల మీదికి చేరుకోవాలని ఆరాటపడే సముద్ర తరంగాల ఈ సుందర సుమనోహర దృశ్యాలను చూస్తే ఇంద్రలోకం ఇదేనేమో, అనిపించదూ? దానికి తోడు ఎత్తుపల్లాలతో నిటారుగా నిలుచున్న కొండలు, గడ్డిపోచలతో అల్లిన హరిత వర్ణపు పట్టు తివాచీని కప్పుకున్నట్టు మిడిసిపడుతూ వుంటే, వెన్నెలతో పోటీగా, విద్యుత్ కాంతి, సృష్టికే ప్రతిసృష్టి చేసినట్లు తారామండలానికి ప్రత్యర్థిలా నిలిచి మిరుమిట్లుగొలుపుతూంటే, కవులూ కళాకారులే కాదు, మనసున్న ప్రతీ వ్యక్తి ఈ ఆనందాన్ని తనివితీరా అనుభవించరూ! ఈ సముద్రుని హెూరు వాగ్గేయకారుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ సంగీత కచ్చేరీలా తన్మయత్వంలో ముంచెత్తేస్తూ వుంటే, పిల్లగాలులు వింజామరలు వీస్తూ మేఘాల పల్లకిలో తేలిపోతూన్న భావాలను కలిగిస్తే, గాలి వెంటబడి కొట్టుకొస్తున్న నీటి తుంపరలు పన్నీరు జల్లుతూన్నట్టుగా ఒంటి మీద పడి, గిలిగింతలు పెడుతూంటే, వచ్చీరాని సంగీతంలో 'ఎంత హాయి ఈ రేయి ఎంత మధురమీ హాయీ' అని ప్రేమ గీతికలు పాడుకుంటూ వుంటే గుండె గుండెలో ఒక తాజ్‌మహల్ నిలవదూ?" గుక్క తిప్పుకోకుండా ఇసుక తిన్నె మీద పడుకుని మాట్లాడుతూన్న మానస, దివి నుండి తనకోసం దిగివచ్చిన దేవకన్యలా అనిపించింది కార్తిక్‌కి. రెప్ప వాల్చకుండా ఆమెకేసి అలాగే చూస్తూండిపోయాడు.

"ఉష్!... ఏ లోకంలో వున్నావు" అతని కళ్లముందు తన అరచేతిని ఊపుతూ అడిగింది మానస.

"నేనున్నది భూలోకంలోనా, స్వర్గంలోకంలోనా? అని ఆలోచిస్తున్నాను." ఆమె ముఖం మీద ముఖం పెట్టి చిరునవ్వుతో చెప్పాడు కార్తిక్!

"స్వర్గం - నరకం! అవి మన చేతుల్లో మన మనసుల్లో వున్నాయి కార్తిక్! ఈ అనుభూతిని ఆస్వాదించే తత్వం వుండాలి. దానితో ఆనందించే మనసుండాలి. అప్పుడూ గాలీ, నీరూ, చెట్లూ, చేమలూ, పక్షులూ, పశువులూ, కొండలూ, బండలూ అన్నీ ఎంతో అందంగా మనకోసమే అమర్చినట్టనిపిస్తాయి. మనసు లేని మనిషికి, ఇవన్నీ పిచ్చి పిచ్చి ఊహలు!" అతని ముఖంపై పడుతూన్న క్రాఫ్‌ని సుతారంగా మునివేళ్లతో సవరిస్తూ అంది మానస.

రెండు మనసులూ ఒక్కటిగా, రెండు తనువులూ ఒక్కటిగా తేలిపోయారు ఇరువురూ. నిశ్శబ్దం సంగీతంలా పలికింది. గంటలు క్షణాల్లా గడిచాయి.

"మానసా? మన చదువులు పూర్తయిపోయాయి. రెండు మూడు రోజుల్లో ఇద్దరం ఇంజనీరింగ్ పట్టా నందుకోబోతున్నాం. నువ్వు మీ ఊరికీ, నేను మా ఊరికీ వెళ్లక తప్పదు. మన సంగతి మన పెద్దవాళ్లకి చెప్పకా తప్పదు. వారి దగ్గరినుంచి మనకి అభ్యంతరాలు రాకా మానవు. ఇవన్నీ మనం ఎదుర్కోవాలి, వీలైనంత త్వరలో! ఇక్కడే ఈ ఇసుక దిబ్బల దగ్గరే, మనం చిన్నారి ఇల్లు కట్టుకోవాలి! కలసి కాపురం పెట్టాలి! పిల్లా... పాపా..."

"ఏయ్‌ఁ... ఆపు" అతని నోటిని తన అరచేత్తో మూసేసింది మానస, అతడి ఒడిలోకి వాలిపోతూ...

"చెయ్యి తియ్యి నన్ను చెప్పనీ..." నోటిమీది నుంచి ఆమె చెయ్యి తియ్యబోతూ అన్నాడు.

"అప్పుడే పిల్లలొద్దు బాబూ!... కనీసం ఒక సంవత్సరమైనా మనం కట్టుకున్న ఈ అనురాగ కుటీరంలో ప్రేమ పక్షుల్లా మనిద్దరమే జాబిలిలో ఆడుకుంటూ, సముద్రుడితో కబుర్లు చెబుతూ, ఈ ఇసక మీద దొర్లుతూ తుళ్లుతూ మైమరచిపోవాలి."

"ఊఁ! అది నావల్ల కాదమ్మా.. మొదటి సంవత్సరంలోనే మనకి కవలలు ఒక బాబు ఒక పాప. ఆ తరవాత మరొకడు, మరొకడు అలా ఎంతమంది పుడితే అంతమంది మనం తారా శశాంకుల్లా, వాళ్లు మన చుట్టూ నక్షత్రాల్లా..."

"చాల్లే ఊరుకో! ఫామిలీ ప్లానింగ్ డిపార్ట్‌మెంటు వాళ్లెవరైనా వింటే, మనకి ఇప్పుడే శస్త్ర చికిత్స చేసేస్తారు"... పకపకా నవ్వింది మానస, నవరాగాలూ పలికించే సప్త స్వరాలలా. పెద్దగా నవ్వాడు కార్తిక్ ఆ రాగాలకి అనువుగా పలికే మృదంగ వాద్యంలా! వీరి సరసాలతో వేడెక్కిపోయిన చంద్రుడు మబ్బుల పరదాలని కప్పేసుకున్నాడు తాపం భరించలేనట్టు. తూరుపు దిక్కు అప్పుడే ప్రసవించింది రవికుమారుణ్ణి! ఇరువురూ లేచి, ఒంటికంటుకున్న ఇసుకని దులుపుకుంటూ హాస్టల్‌కి బయల్దేరారు.

* * *

కులాంతర వివాహానికి ససేమిరా ఒప్పుకోనన్నారు హరి విఠలరావు గారు. "వ్రతం చెడ్డా ఫలమైనా దక్కుతుందా అంటే, కట్నం కూడా ఏమీ లేదంటున్నావ్?" కళ్లనీళ్లు పెట్టుకుంది దేవికారాణి. ఎలాగైతేనేం? పెళ్లికొప్పించాడు కార్తిక్ అతి తొందర సమయంలోనే! ఆ విషయాన్నే ఫోన్‌లోనే చెప్పాలని మానస కోసం హైదరాబాద్‌కి ఫోన్ చేశాడు భీమిలీ నుంచి. ఎన్నిసార్లు చేసినా 'ఆమె లేదూ... లేదూ... లేదూ..." అనే సమాధానం! ఎన్నో ఉత్తరాలు రాశాడు. అన్నీ తిరిగొచ్చాయి. కార్తిక్ గుండె బద్దలయింది, అద్దాల మేడలా! అందంగా నిర్మించుకున్న అనుభూతుల భవంతి కుప్పగా కూలిపోయింది! విశ్వామిత్రుడి తపస్సు భంగం చేసి, అతనిని ఒంటరిని చేసి వెళ్లిపోయిన

మేనకలా అనిపించింది మానస అతనికి! కళ్లు మూసినా కళ్లు తెరిచినా ఆమె రూపే! గాలి వీచినా, వాన కురిసినా ఆమె తలపే! నిదురలో, మెలకువలో చివరికి శ్వాస పీల్చినా ఒదిలినా ఉఛ్వాస నిశ్వాసాలలో ఆమే... ఆమే... ఆమే!

పిచ్చివాడయిపోతూన్న కొడుకుని చూసి కన్నీరు కార్చారు రావు దంపతులు. ఆమెని మరచిపొమ్మని శతవిధాల బోధలు చేశారు. "ప్రేమ నటించి, నిన్ను వంచించిన ఆ పాతకిని మర్చిపొమ్మ"ని హితబోధ చేశారు స్నేహితులూ, పెద్దలూ, ఆప్తులూ అందరూ!

ఏది సత్యమో ఏదసత్యమో తెలుసుకోలేకపోతున్నాడు కార్తిక్! ఆడదంటే అపర రాక్షసిలా, మనుషుల శరీరాలే కాదు మనస్సును కూడా పీక్కుతినే కర్కోటకురాలిలా అనిపిస్తోంది కార్తిక్‌కి! సముద్రాన్ని చూస్తే కోపం వస్తోంది. వెన్నెలంటే వొళ్లు మండిపోతుంది. సంగీతం వింటే అసహ్యం పుడుతోంది. ఆడదాన్ని చూస్తే వొళ్లు కంపరమెత్తుతోంది! కార్తిక్ పిచ్చివాడైపోతున్నాడు.

హరివితలరావు గారికి, కాన్సరని తెలిసింది! ఇంటిల్లిపాదీ దుఃఖంలో మునిగిపోయారు. కొన్ని నెలలలో అతను అందరినీ అన్నింటినీ వొదిలి శాశ్వతంగా కనుమరుగైపోతారని తెలిసి, ఎవ్వరూ కూడా అతణ్ణి క్షణం వదలడం లేదు. ఏది కావాలన్నా చిటికెలో చేసి పెడుతున్నారు.

సరిగ్గా అప్పుడే అతడి వేలువిడిచిన చెల్లెలు సుమతీ, ఆమె కూతురు పుష్కల అక్కడికొచ్చారు. పొడవాటి జెడ, పెద్ద కళ్లూ తీరైన గుండ్రటి మొహమూ, నాజూకైన అంగ సౌష్ఠవమూ అచ్చం తెలుగుబిడ్డ బాపూ బొమ్మలా కనిపించింది పుష్కల, హరి వితలరావు గారికి. "రాణీ! ఈ పిల్ల మన కోడలైతే బాగుంటుందేమో, కార్తిక్‌కి చెప్పి చూడు" అన్నారు. రాణీకి కూడా పుష్కల నచ్చింది. రూపమే కాదు, గుణం కూడా. ఎమ్.ఎస్‌సీ. పాసయ్యింది. పి.హెచ్.డి. చెయ్యాలనుకుంటోందిట. అందం, ఆకర్షణ, గుణం అన్నీ సమపాళ్లలో కనిపించాయి! వెంటనే తండ్రి కోరిక కార్తిక్‌కి చెప్పింది. ఈ పరిస్థితుల్లో నోరెత్తలేకపోయాడు కార్తిక్! కన్న తండ్రి ఋణాన్ని తీర్చుకోవాలన్నా అతణ్ణి సంతోషపెట్టాలన్నా ఇదొక్కటే అవకాశం అతడికి. అందుకే సరేనన్నాడు. ఆ సాయంత్రమే మేడమీది డాబాలో కూర్చుని, మానసతో తన ప్రేమ కథ ఎలా మొదలయిందీ, ఎలా ముగిసిందీ అంతా చెప్పాడు.

"నీకభ్యంతరం వుంటే ఈ పెళ్లి జరగదు" అని చెప్పాడు. పుష్కల చిరునవ్వు నవ్వింది!

ఆ నవ్వులోని అంతరార్థం అర్థం కాలేదు కార్తిక్‌కి!

"మీరు ఎంత నిజాయితీపరులో, ఎంతటి ప్రేమికులో మీరు కళ్లకి కట్టినట్టుగా చెప్పిన మీ ప్రేమ కథే చెప్పింది. ఇంతటి మహోన్నత వ్యక్తి "నన్ను పెళ్లి చేసుకోవడానికి నీకభ్యంతరమా?" అని అడిగితే నవ్వు రాక మరేమవుతుంది?" అంది పుష్కల.

ఆమె మాటలు వెన్నముద్దల్లా వున్నాయి స్వచ్ఛంగా!

ఆమె భావాలు అమృత గుళికల్లా వున్నాయి కమ్మగా!

కార్తిక్‌లో ఏదో సంచలనం!

ఆమె పట్ల ఏదో కమనీయమైన భావం!

ఆమె నడకలో రమణీయత!

ఆమె మౌనంలో భావుకత!

మెల్లమెల్లగా కార్తిక్ ఆమెపట్ల ఆకర్షితుడౌతున్నాడు. రావుగారిలో సంతోషం! దేవికారాణికి పరమానందం! ఒక శుభ ముహూర్తంలో కార్తిక్, పుష్కలలు ఒకటయ్యారు. ప్రకృతి పులకించింది. కల్యాణ భజంత్రీలు నాదవర్షాన్ని కురిపించాయి!

ఆ పులకింతలో వేదోక్తుల మధ్య పెద్దల ఆశీస్సులతో సంసార నావలో అడుగుపెట్టారు కార్తిక్, పుష్కల.

* * *

రెండు వసంతాలు దాటాయి! వర్ష ఋతువు ప్రారంభమయింది. రావుగారు పోయాక ఉద్యోగరీత్యా బొంబాయికి బదిలీ అయి అక్కడే సెటిలయ్యాడు కార్తిక్! పుష్కల బొంబాయి మహా నగరంలో 'మహిళా సూపర్ బజార్' ప్రారంభించింది తెలుగు యువతులందరినీ సమీకరించి! ఉజ్వల, ఉపేంద్ర వారి సంతానం. ఏ ఒడుదుడుకులూ లేక సాగిపోతోంది జీవన నావ!

ఉన్నట్టుండి సుడిగాలులు విరుచుకుపడ్డట్టు, కారు చీకట్లు కమ్మేసినట్లు, తుఫాను ముంచెత్తుకొచ్చినట్టు కార్తిక్ ఉక్కిరి బిక్కిరయిపోయాడు. జెస్‌లోక్ హాస్పటల్లో వున్న తన కొలీగ్ సతీష్‌ని చూడ్డానికెళ్లిన కార్తిక్, పక్క బెడ్ మీద పడుకునున్న మానసని చూసి ఖంగుతిన్నాడు. ఆమె పక్కన కూర్చున్న బాలచంద్రుడిలాంటి యువకిషోరాన్ని చూసి సెగల పొగలతో పాత కథలతో ఉడుక్కున్నాడు. "బహుశ అతడు ఆమె మొగుడై వుండాలి. ఏదో మందు తాగిస్తున్నాడు" అనుకున్నాడు. అతనిలో ఒక్కసారిగా సీలువేసిన యెద గది భళ్లున తెరుచుకుంది! జ్ఞాపకాల దొంతరులు అగ్నిలా దొర్లి జ్వాలలు చుట్టూ చెలరేగాయి. ఆ కోపం ఆ తాపం భరించలేకపోతున్నాడు. ఆమెని పీక పిసికి చంపెయ్యాలనిపిస్తోంది. పక్కనే వున్న అతణ్ణి పిస్తోలుతో పేల్చెయ్యాలనిపిస్తోంది. ఆమెకేసి తీక్షణంగా చూశాడు.

ఆమె చిరునవ్వుతో కార్తిక్‌ని చూస్తూ కళ్లతోనే పలకరిస్తోంది!

ఆ నవ్వు అతని గుండెలో మండే కొలిమిలా అనిపించింది!

ఆ చూపు అతని కళ్లు భరించలేని జ్వాలలా అనిపించింది!

అంతలోనే ఒక ముద్దుల గుమ్మ చిన్నారి బొమ్మలా వున్న పిల్ల పూల గుత్తులు తెచ్చి మానసకివ్వడం చూశాడు.

ఆమె వారి కూతురేమో? ఎంత వంచన. తనతో ప్రణయ సల్లాపాలు జరిపి, మరొకరితో పరిణయ వేడుకలు తీర్చుకుంది ఈ మానస. ఛీ! ఈ రాక్షసిని ఘోరంగా, ఆమె భర్త ఎదుటా, ఆ బిడ్డ ఎదుటా అవమానించాలి! అప్పటికిగానీ తనలోని బాధ చల్లారదు అనుకున్నాడు. మెల్లగా మంచం దగ్గరికి వెళ్లాడు.

"హల్లో మానసా! బాగున్నావా? మనం ఆరోజు విడిపోయాక ఇదే కలవడం" అన్నాడు చాలా ఆప్యాయంగా!

"అవును కార్తిక్! నువ్వెలా వున్నావ్?"

"నాకేం చాలా బాగున్నాను. ప్రేమా గీమా అంతా 'ట్రాష్' అని మా నాన్నగారు కుదిర్చిన అమ్మాయి నా మేనత్త కూతురు పుష్కలని పెళ్లి చేసుకున్నాను. ఇద్దరు అందమైన పిల్లలు ఉజ్వల, ఉపేంద్ర. మలబార్ హిల్స్‌లో మా ఇల్లు! మా ఆవిడ బాంబేలో బిజినెస్ మాగ్నెట్! సంఘ సేవకురాలు!" గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు.

మానస చిరునవ్వు నవ్వింది. "ఐ...యామ్...వెరీ...హేప్పీ... కార్తిక్! నువ్వు చాలా సంతోషంగా వున్నావు. జీవితంలో చక్కగా స్థిరపడ్డావు" అంది.

ఆమె అసూయతో ఉడుక్కుంటుందనుకున్న కార్తిక్, అలా ప్రశాంతంగా నవ్వుతూ మాట్లాడుతూంటే మరింత భరించలేకపోతున్నాడు.

"ఇతడు నీ భర్తా?" అతనికేసి అదోలా చూస్తూ అడిగాడు.

"కాదు, మా తమ్ముడు."

ఖంగుతిన్నాడు కార్తిక్!

"ఆ అందాల పాప నీ కూతురా? అచ్చు నీ పోలికలోనే వుంది" అన్నాడు పాపకేసి చూస్తూ.


"అది వాడి కూతురు. దానికి మేనత్తని కదా నా పోలికే వచ్చింది. నా పేరే పెట్టారు దానికి."

ఈసారి మరీ షాక్ తిన్నాడు. ఏమనాలో, ఏమడగాలో అర్థం కాలేదు.

అది గమనించిన మానస, పాపని తీసుకుని బజారుకెళ్లి రెండు బిస్కట్లు ప్యాకెట్లు తెమ్మని చెప్పింది తమ్ముణ్ణి! అతడు పాపని తీసుకుని బయటికెళ్లిపోయాడు.

గుండెల మీది బరువేదో తగ్గినట్టు తేలిగ్గా ఫీలయ్యాడు కార్తిక్!

"మీ వారెక్కడ?" అడిగాడు.



✳ బెండకాయలు వండేటప్పుడు బాణలికి అంటుకుపోతే, కొద్దిగా లెమన్ జ్యూస్ అయినా, టమోటా రసం అయినా, కొద్దిగా చింతపండు చారయినా కలపవచ్చు.

-భో శ్రీ

"లేరు" అంది నవ్వుతూనే.

"అంటే? ఇక్కడ లేరా? ఈ వూర్లో లేరా? అసలు భూమ్మీదే లేరా?" వ్యంగ్యంగా అన్నాడు.

"ఇక్కడే వున్నారు. కానీ ఎవరికీ కనబడరు" అంది నవ్వుతూనే.

"ఏం ఎందుకని?"

"అతనికి నేనంటేనే ఇష్టం. మరెవ్వరినీ చూడడు. అందుకే నా గుండెల్లోనే నివసిస్తారు" అంటూ నైటీ లోపల గుండెల మీద దాచుకున్న ఫొటో తీసి చూపించింది. కార్తీక్‌కి కళ్లు కనబడడం లేదు! పిచ్చిగా ఫోటోకేసి చూశాడు.

"డియర్ మానసా? ఐ... లవ్... యూ? కార్తిక్!" ఆ అక్షరాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఆ ఫొటో మీద వున్నాయి.

"మానసా?" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

ఆమె కళ్లు ఆనందంతో వర్షించాయి!


"ఎందుకిలా చేశావ్? నన్నెందుకు దూరం చేశావ్? నీకోసం తపించి తపించి పిచ్చివాణ్ణయిపోయాను. మా నాన్న చావు బతుకుల మధ్య వున్నప్పుడు ఆయన కోసం పెళ్లి కొప్పుకున్నాను. నీకోసం ఎన్ని ఫోన్లు చేశాను? ఎన్ని ఉత్తరాలు రాశాను? చివరికి హైదరాబాదొచ్చాను. మీరు అక్కడ లేరని తెలిసింది! చివరికి నువ్వు నన్ను మోసం చేశావని చెప్పి నీమీద ప్రేమనంతా కక్షగా మార్చుకున్నాను. ఎందుకలా చేశావ్? ఏం జరిగింది?" ఆవేశంగా ప్రశ్నలవర్షం కురిపించాడు కార్తీక్.

"పిచ్చి కార్తీక్! నీ ఆవేశం ఇంకా అలాగే వుందా?" అతని చేతిని మెల్లగా నొక్కుతూ.

అతను పిచ్చిగా ఆమె కేసి చూస్తున్నాడు.

"కార్తీక్! ఈ దుప్పటీ తీసెయ్యి! ఉక్కగా వుంది" అంది అతని చేతిని విడిపించుకుంటూ.

అతడు దుప్పటి తీసి, స్థాణువులా నుంచుండిపోయాడు. కాలం స్తంభించిపోయినట్లు! ప్రకృతి మూగబోయినట్లు! ఆమె రెండు కాళ్లూ తొడల వరకూ విరగ్గొట్టి వున్నాయి!



**తోషిబా నోట్‌బుక్ కంప్యూటర్**

ఇంతకుముందు వచ్చిన తోషిబా నోట్‌బుక్ కంప్యూటర్స్‌కంటె ఇది కాస్త పెద్దది. స్క్రీన్ సైజు పెద్దదే కాక 'సైడ్ లైటింగ్' ద్వారా కాస్త మెరుగ్గా కనిపిస్తుంది. స్క్రీన్ వెనక ఉన్న ఫ్లోరసెంట్ ట్యూబ్స్ ద్వారా అక్కడ వెలుగు అన్నివైపులా చక్కగా వ్యాపిస్తుంది. దీని ధర నాలుగు వేల అమెరికన్ డాలర్లు.

-బి.ఆర్. సుంకర

"కార్తీక్! హైదరాబాదు రాగానే నాన్నగారితో మన పెళ్లి విషయం చెబుదామనుకున్నాను. ఆరోజు నేనే కారు నడుపుకుంటూ, నాన్న గారిని అఫీసు నుంచి పికప్ చేసుకోవడానికి బయల్దేరాను. నావెనకే వస్తున్న లారీ ఓవర్ స్పీడులో బ్రేకులు పనిచెయ్యక నా కారుని గుద్దేసింది. అంతే రక్తపు మడుగులో పడున్న నాకు ఏం జరిగిందో తేలిడానికి పదిహేను రోజులు పట్టింది. ప్రాణాలు దక్కాయి కానీ, పాదాల నుంచి మోకాళ్ల వరకూ రెండు కాళ్లూ పోయాయి. మన ప్రేమకథ నాన్నగారికి చెప్పాను. నీ దగ్గర నుంచి ఫోన్ వచ్చినప్పుడల్లా లేనని చెప్పమన్నాను. నీకు తెలిస్తే, నువ్వు రెక్కలు కట్టుకు వాలతావని తెలుసు. కానీ బంగారంలాంటి నీ భవిష్యత్తుని పాడుచెయ్యడం నా కిష్టం లేదు. నువ్వు సుఖపడాలి! నీ కలలు నిజం కావాలి! నీ అనుభూతుల పొదరింట్లో, పిల్లా పాపల్తో నువ్వు కళకళలాడుతూ వుండాలి! అదే నా కోరిక! అందుకే నా అడ్రను నీకు చెప్పలేదు. నాన్న రిటైరయిపోయారు. తమ్ముడికి బాంబేలో ఉద్యోగం వచ్చింది. అందరం బాంబే వచ్చేశాము. నిన్ను మళ్ళీ ఈ జన్మలో కలుస్తానని కలలో కూడా అనుకోలేదు. మనం నిర్మించుకున్న ఊహాసౌధంలో, ఆ పొదరింట్లో నీతోనే వున్నాను కార్తీక్! నీ తలపే నా ఊపిరి! నీ వలపే నా తలపు! అదే నా జీవితం!" ఆమె మాట్లాడుతూన్న ఒక్కొక్క అక్షరం అతడికి ఒక్కొక్క బాకులా గుచ్చుకుంది!

ఆమె సంస్కారం ముందు, ఆమె పవిత్రమైన ప్రేమ ముందు, తను చిన్నగా ఆకాశంలో పున్నమి చంద్రుడి ముందు నుంచున్న కొవ్వొత్తిలా అనిపించింది!

సముద్రమంత ఆమె ఆరాధన ముందు తను పిల్లకాలువలా అనిపించింది!

ఎంత అపార్థం చేసుకున్నాడు! ఎంత అసహ్యించుకున్నాడు! తలుచుకున్నకొద్దీ ఆమె దేవతలా, తానొక కిరాతకుడిలా అనిపిస్తోంది!

"కార్తీక్! ఏమిటలా అయిపోయావ్? నిన్ను అలా చూడలేను.... ప్లీజ్! నా కార్తీక్ భీరుడు కాదు ధీరుడు. నా కార్తీక్! ఆవేశపూరితుడు, అనురాగభరితుడు! ఇలా దీనుడు కాకూడదు. కార్తీక్! ప్రేమించడం, ప్రేమించబడడం గొప్ప అదృష్టం! అదొక వరం. అది మన ఇద్దరికీ లభ్యమయింది. అది ఫలించద మంటావా, అది అందరికీ సాధ్యం కాదు. అయితే మాత్రం అది బ్రహ్మానందం? పూసిన పూలన్నీ పరమేశ్వరుని పాదాలనే తాకుతున్నాయంటావా? అంతమాత్రం చేత అవి పూలు కావా? వాటికి అందం లేదా? ప్రేమ పువ్వు లాంటిది! వాడినా, రాలినా, దాని జ్ఞాపకాలను శాశ్వతంగా నిలుపుకుంటుంది!"

కార్తీక్ కళ్లు సముద్రాలయ్యాయి. చెంపల మీది జలపాతం ఆగడంలేదు. ఆమెని కౌగిలించుకుని ముద్దు పెట్టుకోవాలో, చేతులెత్తి ఆమెకి నమస్కరించాలో అర్థంకాని అయోమయస్థితి!

"కమాన్..... ఐ.సే...... ఊс..." నన్ను లేపి కూర్చోబెట్టు" అంది చెయ్యినందిస్తూ మానస.

అంతలో అప్పుడే తయారయిన ఆర్టిఫిషల్ లెగ్స్ తీసుకువొచ్చారు డాక్టర్ జోషి, డాక్టర్ వైద్యా తదితరులు.

కార్తీక్ మెల్లగా ఆమెను లేపి కూర్చోబెట్టాడు.

అప్పుడే బిస్కట్ ప్యాకెట్లుతో లోపలికొస్తున్న బేబీ మానస ప్యాకెట్లను కార్తీక్‌కి ఇచ్చింది!

అప్రయత్నంగా అందుకున్నాడు కార్తీక్!

మానస చిన్నగా నవ్వింది!

అదే నవ్వు! బీచ్‌లో సముద్రుడి ముందు నవ్విన నవ్వు!

వెన్నెల్లో చంద్రుడు ముందు నవ్విన నవ్వు!

తన బిగి కౌగిట్లో ఉక్కిరి బిక్కిరవుతూ నవ్విన నవ్వు!

ఆ నవ్వే కార్తీక్ గుండెల్లో నిలిచిపోయిన పువ్వు!

ప్రతీ వ్యక్తి జీవితంలో ఆ నవ్వుని కాస్త నాకివ్వమని కోరుకుంటే బ్రతుకు ధన్యం! ❑